# ★ సారె ★

శ్రీమతి ఎస్. కె. రాజేశ్వరి రాణి

ఏదీ వినిపించలేదు కమలకు! ఒక్క ఐదువందల రూపాయలు అప్పు మాత్రం అవుపడుతోంది. మూడు బండ్లతో వచ్చిన కోడల్ని చూసి రాజమ్మ మురిసిపోయింది. సారె కుండలు తెచ్చిందని. సాగరునిలా ఉప్పొంగిపోయింది. సారె చీరలు ఖరీదైనవే తెచ్చిందని తైతక్కలాడింది. కమలకు దిష్టితీసి లోనికి పిల్చుకొనిపోయింది. హాలుకు ఒకవేపు అన్నిసామానులూ కమల అన్నగారు పరమేశం పెట్టిస్తున్నాడు. కమల తలవంచుకొని వంటింటి గుమ్మందగ్గర నిలుచుంది. "ఈ చీర భలేబావుంది వదినా! ఎంతట?" అన్న పెద్ద ఆడబిడ్డమాటలకూ "ఇలాంటి చీరే నే కావాలన్నది" అని చిన్నాడబిడ్డా అన్న మాటలకూ కమల బలవంతంగా ఒక్క నవ్వునవ్వింది. ఎంతో కష్టం, నష్టం కడుపులో దాచుకొని అన్న ఇన్ని సామానులతో తన్ను అత్తగారింట దింపాడు. రేపు వెళితే ఏం చేస్తాడు? అసలు ఈరాత్రికే బియ్యంలేవు. తమ్ముడికి అందులో జ్వరం. అమ్మ అప్పంటేనే అదిరిపోతుంది. అన్న డెబ్బయిరూపాయల జీతంలో సంసారం నడుపుతాడా? అప్పుతీరుస్తాడా? గొప్పసంబంధమని చేశారు. చెల్లెలుసుఖపడుతుందని. కాని తనో? అందులో రామయ్యదగ్గర అప్పు. ఆ శెట్టి మూడు నెల్లకుపైగా వూరుకోడు. ఎవరి మెడలోనూ కాసంత పచ్చనిబంగారం లేదుకదా!

"అదృష్టవంతురాలివి రాజమ్మా! కోడలు సారె బాగా తెచ్చింది" అని ఎదురింటి వెంకాయమ్మ మెచ్చుకొంది. ఆ మెప్పు రాజమ్మగారికి వజ్రకిరీటం. ఆపాళాన ఆవిడ కోడలివేపు గర్వంగా చూసింది. కోడలంటే ఆమెకోదేవతలా అవుపడ్డది సరివారిలో పరువు కాపాడినందుకు. ఆ వీధి అంతా కోడలు తెచ్చిన పిండి వంటలసారె తాలూకు వన్నీ పంచింది. రామమ్మ నేరుగా ఇంటికివచ్చి ప్రశంసించింది. "మొన్న అడ్డాలవారింటికి కోడలొచ్చింది. అయ్యోపాడు! రెండు సారెకుండలు తెచ్చింది. పాపం తులసమ్మ ఇప్పటికీ తలెత్తుక తిరగలేకపోతోందే రాజమ్మవదినా! నీకోడలు ఎన్ని తెచ్చింది! లడ్డూలు అమృతమే. అత్తిరసాలూ అంతబావున్నాయి. అలాంటిపాకం అందరికీ రాదు. "ఆడ బిడ్డలకు చీరెలు కూడా తెచ్చింది. చూడు ఇవి" అన్నది రాజమ్మ.

కమలకు రాత్రిళ్ళు ఒకటే కలలు. కన్నవారింటిని రామయ్య జప్తు చేస్తున్నట్టు. కట్టు గుడ్డలతోవారు........ కమల వులిక్కిపడి లేచేది, కన్నీళ్ళు కార్చేది. అంతకన్న ఆ పిల్ల ఏంచేస్తుంది? రోజులు గడుస్తున్నాయి. కమల వచ్చి అప్పుడే ఆరు నెల్లు కావస్తోంది. పుట్టింటినుంచి ఓ ఉత్తరంకూడా రాలేదు ఈలోపల. కమల రెండు మూడు ఉత్తరాలకు బదులులేదు. ఒకరోజు సాహసించి భర్తనడిగింది. పుట్టింటివారిని చూసి వస్తాను అని. కమల మరునాడు చిన్న మరిదితో బండీ దిగింది.

ఎదురుపడ్డ పరమేశం ముఖం చిట్లించుకొని పోయాడు. కమల వులిక్కిపడ్డది. తాను వద్దన్నా ఎందుకు అప్పుచేసి అవన్నీ తీసి చేసిపంపించాడు అన్న?

వదినా ఆఖరికి తల్లీకూడా ముభావంగానే వుండిపోయారు. వడ్డనలో నెయ్యి కమలకు ఆమె మరిదికి ప్రత్యేకించి వడ్డించింది వదిన. చిన్న పిల్లలు నెయ్యి అని అరిచారుగాని వాళ్ళను వురిమి చూసింది కోడలు.

కమలకు తలకొట్టేసినంత పని అయింది.

"వదినా! నేను వెళ్ళవస్తాను" అని మరిది వెళ్ళిపోయేడు. తాను తిరుగుబండికి వెళ్ళినా అత్తగారింట ఏమి అనుకొంటారు? కమల కన్నీటితో తల్లినిచూసింది. ఆరాత్రి అన్నగారి మాటలు విన్నది. ఇంకా ఏది తక్కువైందని మరిదితో వచ్చిందీవిడ. ఇప్పటికే గుల్లయింది.

కమల అదిరి పడ్డది. నడివీథిలో మానం పోయినట్టనిపించింది. తానొచ్చింది దేనికి? అయినా తానడుగలేదు కద! తాను అత్తింటి కష్టాలు పడితే పడిందని వూరుకోక మెప్పుకోసం ఎందుకు అప్పయినా చేసి ఆర్భాటాలు చేసింది? తానొచ్చిందే తప్పు.

"నే వెళ్ళిపోతున్నానమ్మా!" అన్నది ఆరాత్రి. అమ్మకు కాలులేదు. ఆవిడ మంచంమీదే ఉంది. పరిస్థితులన్నీ ఆవిడతో చెప్పుకొని ఏడ్చేసింది కమల.

"ఎవరి తప్పూ లేదమ్మా. నువ్విప్పుడు అక్కడ మనిషిలా తిరుగుతున్నావంటే సారె బాగా తెచ్చేవనే.

అంతే. మాకష్టాలు నూరుంటవి. నువు నిశ్చితంగావుండు" అన్న తల్లిమాటలు కమలకు చెంపపెట్టునిచ్చింది. తన తల్లేనా ఇలా మాట్లాడడం? "అమ్మా నేనెందుకింత చేదయిపోయాను" అని ఏడ్చింది.

ముసలామె మనసు కరిగింది. మీ అన్న రోజూ అంటున్న మాటవల్ల నా మనసు విరిగిపోయింది. మెప్పు కోసం పోకపోతే ఆడపడుచువి నీ కంటనీరు కారితే వాడి కుటుంబానికే కీడు. నువ్వు పచ్చగా వుంటే అదే పదివేలు. నువు చింతపడబోకు. నామాట విను" అన్నది.

కమలకు మనశ్శాంతి కలగలేదు. మగతగా కన్ను మూసిం దారాత్రి. రాజమ్మ కోడలి నడవడికను గ్రహించ కల్గింది. అడిగింది ఒకనాడు. కమల తన్ను తాను మర్చిపోయింది. కన్నీళ్ళతో జరిగింది చెప్పివేసింది. రాజమ్మ నోరంతా తెరిచి విన్నది. "అలాగటనే" అన్నది.

కమల ఆ తర్వాత భయపడ్డది. రాజమ్మ కోడలితో ఆపైన ఏమీ పలకలేదు. నాలుగురోజులు గడచిపోయినవి. ఒకరోజు అత్తగారు పిలువగనే కమల భయపడుతూ వెళ్ళి నిలుచుంది.

మన కాంతాన్ని మీతమ్మునికి ఇస్తామని రాశానే. మీ అన్నయ్య వప్పుకొన్నాడు." కమల ఆశ్చర్యంతో వింటోంది. "వారం రోజులుంది ముహూర్తం."

కమల తెచ్చిన సారె ఎంతో అంతా కాంతం వెంట పరమేశం ఇల్లు చేరింది. అత్తగారి దివ్యగుణానికి కమల ఏంచెప్పాలో తోచలేదు. పరమేశం కమల దగ్గర "క్షమించు కమలా!" అన్నాడు. "మా అత్తగారికి నమస్కరించు అన్నయ్యా. నాదెంలేదు. అంతా అత్తయ్యగారి చలవే" అన్నది కమల.

కానీ కమలకదిలిపోయింది. కల చెరిగిపోయింది. దిగ్గునలేచి కూర్చొంది. కల! కల! అలా జరిగితేనా. ఇంకేంవుందీ ఆ పైన!

రాజమ్మగారి మాటలు కమల బండీ దిగిందో లేదో అప్పుడే వినిపించింది. "మెప్పు కోసం ఎవరేడ్వమన్నారు. పుట్టింటి ఆశ వదులుకోవాలి. అవమానపడి తిరుగ మొహం చూపి ఎందుకొచ్చినట్లు? "మరిది అంతా చెప్పాడని గ్రహించింది కమల. మారుపలుకకుండా లోనికి పోయింది. సారె తేని తోటికోడలు మాత్రం కమలని ఓదార్చింది. "నువెందుకు తెచ్చావు సారె?" "మెప్పుకోసము"అని తన్నుతాను ప్రశ్నించుకొందికమల.

---


## ప్రప్రథమంగా ఎన్నుకోవలసినవి

మీరు చూపరులకు అందంగాను, ఆకర్షణీయంగాను ఉండి ప్రజామోదం పొందాలంటే మైసూరు ప్రభుత్వపు జార్జెటు చీర, దానికి తగిన చక్కని అంచుగల క్రేపు జాకెట్టు ధరించాలి.

**అవి ధరిస్తే ఎంత హాయిగా ఉంటుంది!**

అవి చూచుట కెంతో మనోహరంగా ఉంటాయి, కట్టుకొనుటకెంతో బాగుంటాయి, చాకలికి వేసినా చెడిపోవు, చాలా కాలం మన్నుతాయి.

ఒక పర్యాయం మీరు వాటిని ఉపయోగించినట్లయితే, మరియొక బట్టమీదికి మీదృష్టి యెన్నడూ పోదు.

జ్ఞాపకముంచుకోండి

మైసూరు ప్రభుత్వపు జార్జెట్టు చీర
అందమైన అంచుగల క్రేపు జాకెట్టు
100% నూటికి నూరు పాళ్లు స్వచ్ఛమైన మైసూరు పట్టు

గవర్నమెంటు సిల్కు వీవింగు ఫ్యాక్టరీ, మైసూరు.